వానొస్తే.. వరదొస్తే..

- రాకపోకలకు అంతరాయం
- లోలెవల్ కల్వర్టులతో ఇక్కట్లు
- స్తంభంపల్లిలో హైలెవల్ బ్రిడ్జికి టెండర్లు
- బోయినపల్లిలో బ్రిడ్జికి ప్రతిపాదనలు

బోయినపల్లి: వర్షాకాలం వచ్చిందంటే ఈ గ్రామాల ప్రజలు ఇబ్బందిపడతారు. భారీ వర్షాల వల్ల ప్రధాన రహదారిలో ఉన్న లోలెవల్ కల్వర్టులపై నుంచి వరద నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీ రహదారిలో లోలెవల్ కల్వర్టులు మునిగి రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బోయినపల్లి గ్రామ పరిసరాల్లో, స్తంభంపల్లి గంజివాగు వద్ద కల్వర్టులతో పాటు రెండు మినీ కల్వర్టులు ఉన్నాయి. రెండు ప్రాంతాల్లో వర్షాలు కురిసి కల్వర్టులపై నీరు ప్రవహించినప్పుడు గ్రామపంచాయతీ వారితో పాటు, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు రక్షణ చర్యలు చేపట్టడం సర్వసాధారణమైంది.



బోయినపల్లి కల్వర్టు వద్ద వరద ప్రవాహం (ఫైల్)



స్తంభంపల్లి కల్వర్టుపై వరద ప్రవాహం (ఫైల్)

ప్రయాణం కష్టతరం

వేములవాడ నుంచి గంగాధర వెళ్లేందుకు వయా స్తంభంపల్లి, బోయినపల్లి గ్రామాల మీదుగా కొన్నేళ్లుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రూట్‌లో గంగాధర వేములవాడకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. భారీ వర్షం కురిసి వాగులు పొంగితే రెండు కల్వర్టుల పైనుంచి వరద నీరు వెళ్లిన క్రమంలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. బదులుగా దేశాయిపల్లి, రామన్నపేట, అయ్యోరిపల్లి గ్రామాల మీదుగా మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో దూరభారం పెరగడంతో పాటు, వ్యయప్రయాసలకు గురవుతున్నట్లు ప్రజలు తెలిపారు. కల్వర్టులు మునిగితే తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, కోరెం, స్తంభంపల్లి, గుండన్నపల్లి తదితర గ్రామాల ప్రజలు వేములవాడ వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు.

స్తంభంపల్లిలో హైలెవల్ బ్రిడ్జి

గంజివాగు కల్వర్టు వద్ద అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పీఆర్ ఏఈ పవనకుమారి తెలిపారు. టెండర్లు సైతం పూర్తయ్యాయని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే వర్షాకాలం ప్రారంభమయ్యాక పనులు జరగడం గగనమే. అలాగే బోయినపల్లి గ్రామ పరిసరాల్లో రూ.2 కోట్ల అంచనాలతో బ్రిడ్జి నిర్మాణానికి లైన్ ఎస్టిమేట్‌తో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ తెలిపారు.

వేములవాడ వెళ్లేందుకు ఇబ్బంది



వర్షాకాలంలో స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు మీది నుంచి నీరు ప్రవహిస్తుంది. బోయినపల్లి నుంచి వేములవాడ దగ్గరగా ఉండడంతో వ్యాపార అవసరాలకు రాకపోకలు సాగించే వారికి వేములవాడ వెళ్లి రావడానికి ఇబ్బందిగా ఉంటుంది.
– రాజూరి కిరణ్, వ్యాపారి, బోయినపల్లి

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో బోయినపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్న కల్వర్టుపై నుంచి వరద నీటి ప్రవాహ ఉధృతి బాగా ఉంటుంది. ఈ క్రమంలో కల్వర్టుపై నుంచి రాకపోకలు నిలిపివేస్తారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్య తీరుతుంది.
– బోయిని ఎల్లేశ్, బోయినపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు



బోయినపల్లి–వేములవాడ బీటీ రోడ్డులో ఉన్న స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. బోయినపల్లి పరిసరాల్లో కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.
– పవనకుమారి, పీఆర్, ఇన్‌చార్జి ఏఈ

క్లుప్తంగా

ఆస్పత్రి కోసం ధర్నా



నల్ల బెలూన్లతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించాలని మండల యువజన సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించి, నల్ల బెలూన్లతో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్న ఇప్పటివరకు మంజూరు కాలేదన్నారు. 31 నెలలుగా నిరసనలు చేస్తే అక్రమంగా కేసులు పెట్టించడంపై ఉన్న శ్రద్ధ ఆస్పత్రి మంజూరుపై లేదన్నారు. ఆస్పత్రి మంజూరు చేసేంత వరకు ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసన్న, శ్రీనివాస్, స్వామి, రజినీకాంత్, రాజు, లక్ష్మణ్, రాజు, శేఖర్, ప్రశాంత్, ఆంజనేయులు, అంజి పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల ప్రక్రియ వేగవంతం చేయండి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

బోయినపల్లి: మండలంలో నూతన ఓటర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ దర్పెల్లి నరేశ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు ఆప్‌లో ఎప్పటికప్పుడు ఓటర్ల నమోదు చేయాలని తెలిపారు. చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగించాలని, అడ్రస్ మార్పు తదితర వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్ఏ భూపేశ్, ఆర్ఐ ప్రభాకర్, గ్రామాల బీఎల్‌వోలు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో బన్నాజీ

వేములవాడరూరల్: వేములవాడ, చందుర్తి మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలను ఎంఈవోలు భూక్య బన్నాజీ, శ్రీనివాస్‌దీక్షితులు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలలు జూన్ 12 పునఃప్రారంభమైన పాఠ్య పుస్తకాల సరఫరా చేయడంలో జాప్యం జరిగింది. విద్యావనరుల కేంద్రంలో ఆయన ఆయా గ్రామాల బాధ్యులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఇన్‌చార్జి జయలక్ష్మి, సీఆర్‌పీలు శ్రీనివాస్, నగేశ్, ఎల్లేశ్, రాజు, చైతన్య, సతీష్, నవీన్, ప్రధానోపాధ్యాయులు బోయిన్‌పల్లి తిరుపతి, విక్కుర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమాచారం

మైనార్టీ గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంతో పాటు వేములవాడలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలో టీజీటీ(ఉర్దూ), ఫిజిక్స్ లెక్చరర్, వేములవాడలో జూనియర్ లెక్చరర్ (డెయిరీ టెక్నాలజీ) విభాగంలో మూడు ఖాళీలున్నాయన్నారు. సంబంధిత విద్యార్హతలు గల నిరుద్యోగ అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో ఈనెల 21 లోపు కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 99497 71639 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏఐసీసీ కార్యదర్శులను కలిసిన 'పొన్నం'



ఏఐసీసీ కార్యదర్శులతో పొన్నం, స్థానిక నేతలు

సిరిసిల్లటౌన్: ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథం, మన్సురలిలను శుక్రవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కలిశారు, హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారిని కలిసి మాట్లాడారు. ఆయనతో పాటు సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఉన్నారు.

తూకంలో మోసం చేస్తే చర్యలు



సిరిసిల్ల: వినియోగదారులను తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ రూపేశ్‌కుమార్ హెచ్చరించారు. సిరిసిల్ల కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం తూకంలో మోసాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో అందరూ తూనికలు, కొలతల శాఖ ద్వారా జారీ అయిన తూనికల రాళ్లను వినియోగించాలని సూచించారు.

ముగ్గురు ఎస్సైలకు పదోన్నతి

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి వచ్చింది. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రహీంపాషా, రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సై బి.ప్రశాంత్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న ఎం.డీ.రఫీక్‌ఖాన్‌లు పదోన్నతి పొందారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి

బోయినపల్లి: కొత్త రేషన్ కార్డుల మంజూరులో జాప్యంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో రెండుసార్లు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. బతుకుదెరువుకు గల్ఫ్ దేశాలు వెళ్లే వారి పేర్లను రేషన్‌కార్డులో తొలగించడం దారుణమన్నారు. నాయకులు అశోక్, మహేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనండి

తంగళ్లపల్లి: తెలంగాణ యువత మేధో సామర్థ్యాన్ని గుర్తించి వారిని ప్రోత్సహించడానికి రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ఎగుర్ల ప్రశాంత్, ఆకెని సతీష్, అభినయ్ గౌడ్, పయ్యావుల శ్రీనివాస్, శేఖర్, గట్టిపెల్లి బాబు, దూస రాహుల్, గొంటి అనూష్, సాత్విక్, రఘునాథ్ పాల్గొన్నారు.

సిలిండర్ లీకేజీతో మంటలు.. వృద్ధురాలికి గాయాలు

వీర్నపల్లి: సిలిండర్ లీకై మంటలు అంటుకుని ఒక మహిళకు స్వల్ప గాయాలైన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కముటం నర్సవ్వ శుక్రవారం సాయంత్రం వంట చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించింది. దీంతో ఒక్కసారిగా మంటలు రావడంతో నర్సవ్వకు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 సమాచారం అందించి, వెంటనే చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బీఆర్‌ఎస్ ప్రజాధరణ కోల్పోతోంది

- లింగన్నపేటలో జెండా పండుగలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు ఉమేశ్‌రావు



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

గంభీరావుపేట: బీఆర్‌ఎస్ ప్రజాదరణ కోల్పోతుందని, ఆ పార్టీపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర నాయకుడు చీటి ఉమేశ్‌రావు అన్నారు. మండలంలోని లింగన్నపేటలో కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి ప్రజలు ఈసారి ఓట్లేసి రుణం తీర్చుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. లింగన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు ఎందుకు కేటాయించడం లేదని అధికారులను ప్రశ్నించారు. వారం రోజుల్లో ఇళ్లు కేటాయించకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని, లబ్ధిదారులకు మద్దతునిస్తామన్నారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్న క్రమంలో ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరాయని, మందుబాబులకు అడ్డాలుగా మారాయన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, సురేశ్, ఎల్లయ్య, దేవయ్య, షేక్ తాజోద్దీన్, హరీశ్, రాజేశ్, నవీన్, స్వామి, భాను, మదన్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల దగ్గర కొనుగోలు చేసిన వడ్ల డబ్బులను చెల్లించే పరిస్థితిలో లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ జెండాను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఐకేపీ, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ డబ్బులు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు లక్ష రూపాయల రుణమాఫీ అమలు పరచడం లేదన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. జిల్లాలో వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఇప్పటికి పరిహారం అందలేదన్నారు. రైతులు పుట్టెడు దుఃఖంతో ఉంటే ప్రభుత్వం దశాబ్ది సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు లింగం గౌడ్, లక్ష్మారెడ్డి, చెన్ని బాబు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం



సిరిసిల్లఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని కేజీబీవీ పాఠశాలలో 17వ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ జయరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం శ్రమదానం చేపట్టారు. పాఠశాలలోని చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి 9వ వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీలు కాదు.. ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

- బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మదుకర్

వీర్నపల్లి: బీసీ కులాలకు రాయితీలు కాదు, 50 శాతం ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మదుకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పాలకవర్గాలు రాజకీయ ఓటు బ్యాంకు కింద మాత్రమే పరిగణిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కార్యదర్శి కొమురయ్య, నాయకులు ప్రశాంత్, జనార్ధన్ సాయి లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం



ఎంపీడీవోకు వినతిపత్రాన్నిస్తున్న సిబ్బంది

వీర్నపల్లి: గ్రామపంచాయితీ సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని మండల అధ్యక్షుడు లద్దూరి నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. గ్రామపంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సురేశ్, ప్రధాన కార్యదర్శి శేఖర్, లింగవ్వ, రాజు, నగేశ్ పాల్గొన్నారు.

రూ.120 కోట్లతో రింగ్‌రోడ్డు

- వేములవాడలో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడ నియోజకవర్గానికే గుండెకాయ అని, రూ.120 కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పట్టణ ప్రగతికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత తొమ్మిదేళ్లలో తాగునీరు, రహదారులు, పరిశుభ్రత, వైద్యం, విద్య, వ్యాపార రంగాలలో గణనీయ మార్పు వచ్చిందన్నారు. విలీనమైన గ్రామాలతో కలుపుకుని మున్సిపల్ జనాభా 54 వేల మందికి చేరుకుందని తెలిపారు. ఇప్పటికే వేములవాడలో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలోనే పట్టణంలో రూ.100 కోట్ల పనులకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లు సిరిగిరి చందు, మారం కుమార్, జోగిని శంకర్, బింగి మహేశ్, ఇప్పపూల అజయ్, కుమ్మరి శిరీష, గూడూరి లక్ష్మి, నాయకులు హన్మండ్లు, నరేందర్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్



బహుమతులు అందజేస్తున్న సీఐ కిరణ్‌కుమార్

కోనరావుపేట: గ్రామీణులు ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కిరణ్‌కుమార్ కోరారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించిన దోస్త్ మేరా పోలీస్ కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. అపరిచితుల నుంచి ఫోన్‌కాల్ వస్తే ఎలాంటి సమాచారం చెప్పొద్దని సూచించారు. ఎండాకాలంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని, యువకులు బృందాలు గస్తీ తిరగాలని కోరారు. ఎస్సై రమాకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కోనరావుపేటలోని మోడల్ స్కూల్‌లో 'ఎఫెక్ట్స్ ఆఫ్ డ్రగ్స్ ఆన్ సొసైటీ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలల వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ బహుమతులు అందజేశారు. ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కె.రజని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కోనరావుపేట: మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన సోమిరెడ్డి మహేందర్ రెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.35 వేల చెక్కును సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు అందజేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం సర్పంచ్ నిమ్మ లక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అపెరా సుల్తానా పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో కందుకూరి శ్రీనివాస్ రూ.50 వేలు, రాగిపెల్లి రవీందర్ రూ.49 వేలు, బండి రేణుక రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ శివజ్యోతి అందజేశారు.

పరామర్శ

కోనరావుపేట: మండలం నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల స్వామి తండ్రి సిద్దయ్య ఇటీవల మృతి చెందగా అతని కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా అందజేత

కోనరావుపేట: రెండు నెలల క్రితం మృతి చెందిన మండలం గొల్లపల్లి(వట్టిమల్ల) గ్రామానికి చెందిన బండ బుచ్చవ్వ కుటుంబానికి రైతు బీమా కింద మంజూరైన రూ.5 లక్షల సాయాన్ని సర్పంచ్ గోపు పర్శరాములు అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అక్కెన నాగరాజు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను సర్కారు వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెన నాగరాజు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవని, తరగతి గదుల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నాయకులు సామనపల్లి ప్రశాంత్, లోపెల్లి రాజు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇంకా అందలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. కార్మిక భవనంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు ఏడు వేల మంది రైతులకు పంట నష్టపరిహారం రావాల్సి ఉందని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ ఈ విషయంలో దృష్టి సారించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పంతం రవి, మీసం లక్ష్మణ్, నాగరాజు, బాలరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రసమయిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లిలో జరుగుతున్న ముత్యాల ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, సర్పంచ్ వాణి, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, శ్యామలదేవి, ఎస్సై రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి



విఠల్ రెడ్డికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: భూ తగదాలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఒకరు సెల్ టవర్ ఎక్కిన ఘటన తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తనకు న్యాయం చేయాలని శుక్రవారం విఠల్‌రెడ్డి సమీపంలోని సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతన్ని బుజ్జగించి కిందకు దింపి అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చారు.